# నగ్న దిన మహోత్సవము

కచేరీపని చూచుకొని నేను సాయంత్రం యింటికివచ్చి అవశిష్టాలు తీర్చుకొని ఆరోజు న్యూసుపేపరు చదువుతూ సోఫా మీద కూర్చున్నాను. ఆరోజున ఎందువల్లనో క్లబ్బునుంచి యింటికి వచ్చేసింది చప్పున నాభార్య, చేతిసంచీ ఒకచేత్తోనూ, పొట్టి గొడుగు యింకోచేత్తోనూ పట్టుకొని స్లిప్పర్లు తొడుక్కొని వచ్చేసరికి న్యూసుపేపరు బల్లమీద పెట్టి, ,,ఏమిటి సమాచారం, వటీ'' అన్నాను, నాపక్క కూర్చోమని చోటు చేస్తూ.

,,మరేమీలేదు. మీరు పాపం కనిపెట్టుకు ఉంటారని చప్పున వచ్చాను'' అని నాభార్య, చేతిసంచీ బల్లమీద పెట్టి, గొడుగు సోఫామీద నా ప్రక్కను పెట్టి, ఎదురుగా ఇంకో సోఫామీద కూర్చుండి, ,,ఏమిటి పేపరు విశేషాలు?'' అంది.

,,మరేమీలేవు. కాని నేను కనిపెట్టుకు ఉంటాననీ ఈ వేళ మాత్రమే నీకు తోచిం దెందుకో?''

,,ఈ వేళైనా తోచిందని సంతోషించకూడదూ? ఎప్పుడూ తప్పులు వెదకడమేనా!'' అంది.

,,నో ఫియర్, ఊరికే మాటవరసకి అడిగాను, డియర్.''

„నాన్‌కింగ్ జపాను పట్టుకున్నట్టేనా” అంది మా గృహ కృత్యాలకి సంబంధించిన విషయంలాగే.

„ఆ, కొద్దితరవాయిగా — రేపో, ఎల్లుండో జపానువాళ్ళ వశమౌతుందన్నమాటే” అన్నాను.

„ఇంకా విశేషాలు?”

„తేనెటీగల కల్చరును గురించి మంచి వ్యాసం ఎవరో అనుభవజ్ఞుడు రాశాడు” అన్నాను.

„బీ కల్చరా! ఎవరికావాలి పోనిస్తురూ.”

„అయితే పటీ, బీ కల్చరు అంటే” —

„తేనెటీగల్ని పుట్టించడం పెంచడం” —

„లేడీస్ కల్చరంటేనో?” అన్నాను.

„ఏమిటీ?”

„వినిపించలేదూ?”

„మళ్ళీ ఆక్షేపిస్తే ఊరుకోను సుమండి, ఏమనుకున్నారో!

„లేడీస్‌ను పుట్టించడం పెంచడం ...”

„సంతోషించాం లెండి తెలివితేటలు. ఈపాటికి భోజనానికి లెండి.”

ఉడుకుబోతుతనంతో నా భార్య చేతిసంచీలో వస్తువులు అటూ ఇటూ సర్ది, కలాలు తీసి బల్లమీదపెట్టి, హెయిర్ పిన్నులూ, దువ్వెనా, అద్దమూ సొరుగులో పెట్టి, కొన్ని కాగి

తాలు తీసుకొని వెళ్ళి తన పెట్టెలో పెట్టి తాళం వేసుకొన్నది. ఇద్దరమూ భోజనానికి లేచాము.

* * *

భోజనముచేసి వచ్చి తాంబూలం నములుతూ సోఫామీద వాలుతుంటే పచ్చకాగితం మడత ఒకటి కింద కనిపించింది. నాభార్య సంచీలో కాగితాలు సర్దుకొంటూండగా కిందపడి ఉంటుందని ఊహించి బద్ధకంగా వంగి కాగితంమడత తీశాను. బద్ధకంగానే మడతవిప్పాను. మొదటిపంక్తి చదివాను. ఉలిక్కిపడి లేచి కూచున్నాను. ఎలెక్ట్రిక్ షాక్ తగిలినంతపని జరిగింది. ఆమూలాగ్రంగా ఆకాగితం చదివాను. ,,వట్" అని కేకవేశాను.

,,ఏమిటా వెర్రికేకలు—వస్తున్నానుండండి" అని ప్రక్కగదిలోనుంచి నా భార్య సమాధానం యిచ్చింది ప్రేమపూర్వకంగా! నాకళ్లను నేను నమ్మవచ్చునా, నేను కలగంటున్నానా అనుకొంటూ మళ్ళీ కాగితం చదివాను. నాకళ్లు నన్ను మోసగించడంలేదు. పచ్చకాగితంమీద బంగారం అద్దిన అక్షరాలు, స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నగ్నదిన మహోత్సవాహ్వాన పత్రిక

—లేడీస్ కల్చర్ క్లబ్;—అని పైని హెడ్డింగు ఉన్నది:

* * *

నగ్నదిన మహోత్సవమును, యీ యేడు క్రొత్తగా జరపడమును కార్యనిర్వాహక వర్గమువారు తీర్మానించారు కాబట్టి క్లబ్బు సభ్యురాండ్రందరూ యిందు పాల్గొనడమునకున్నూ, జయప్రదముగా నిర్వహించడమునకున్నూ యిందుమూలముగా ఆహ్వానింప బడుచున్నారు.

షరాలు :—

౧. అందరికీ అనుకూలమైన దినమే ఏర్పాటుచేసి తెలియజేయబడును కాబట్టిన్నీ అందరికీ అనుకూలమైన రహస్యస్థలమందే యీ మహోత్సవము జరుపుటకు నిశ్చయింపబడినది కాబట్టిన్నీ సభ్యురాండ్రందరూ తప్పక పాల్గొనవలసి యున్నది. పాల్గొనని సభ్యురాండ్రు తమ సభ్యత్వమును వదలుకోనైనా వదులుకోవాలి, లేదా, ఏభై రూపాయలు క్లబ్బుకు దండుగైనా చెల్లించాలి.

౨. సభ్యురాలు ఒక్కొంటికి సమ్మతమైన ఒక స్నేహితురాలిని గెస్టుగా తీసుకొనిరావచ్చును. పూర్వకాలపు వితంతువులైనాసరే. సభ్యురాండ్రకు వలెనే స్నేహితురాండ్రున్నూ, క్లబ్బురూల్సు అన్నింటికి బద్ధులై ఉండవలెను.

౩. నగ్నదినమున పాల్గొనే సభ్యురాండ్రుగాని, యితర స్త్రీలుగాని ఎట్టివిధమైన బట్టలూ—నూలువికాని, పట్టువికాని, ఉన్నివికాని, మరి ఏ యితరపదార్థములతో తయారైనవికాని. కట్టుకోరాదు. ఏ శరీరభాగమూ ఆచ్ఛాదితము కారాదు.

౪. తీసివేయడానికి వీలైన నగలు తీసివేయాలి. తీసివేయడానికి వీలులేని నగలు——కడియాలూ-చెవులకు పోగులతో బంధించిన లోలకులూ, జూకాలూ వంటి ఆభరణాలూ మున్నగునవి ఉంచుకోవచ్చును. ఎవరికైనా నల్లపూసల పేర్లూ మంగళసూత్రాలూ ఉన్నట్లయితే అవికూడా తీసివేయడం మంచిదని సలహాయిస్తాము. సిల్లీ సెంటిమెంటూ, తెలివితక్కువ సంకోచాలూ పెట్టుకోవడం మంచిది కాదుగదా!

౫. శరీరమున కంతకూగాని, ఏఒక్క శరీరభాగమునకు గాని ఎట్టిపూతలూ పనికిరావు. ఫేసుపౌడరు, స్నో, చెర్రీబ్లాసం, లిప్‌స్టిక్, గంధం, పసుపు, కుంకుం, తలనూనె యిత్యాది పూతలేమీ పూసుకోరాదు. అందరూ తలనీళ్ళోసుకొని ఆరోజునవచ్చి ఆ వుత్సవములో పాల్గొనవలెను.

౬. జడలూ, ముడులూ వేసుకోరాదు. కొప్పు పెట్టుకోరాదు. తలలో పువ్వులూ, పిన్నులూ పెట్టుకోరాదు.

౭. పాలుతాగే చంటిపిల్లలున్నవాళ్లు పిల్లలను తీసుకొని రావచ్చును గాని యింటివద్ద దాసీలకు వప్పజెప్పడమే మంచిదని అట్టివారికి సలహా యిస్తున్నాము.

౮. ఆరోగ్య సౌందర్యముల వృద్ధికొరకే ఈ నగ్నదిన మేర్పాటైనది. కాబట్టి అందు కనుగుణంగా అందరూ సంచరిస్తారని ఆశిస్తున్నాము.

౯. ఈ విషయం సభ్యురాండ్రున్నూ, రాదలచినవారి స్నే హితురాండ్రున్నూ గూఢాతి గూఢంగా ఉండాలి. భర్తలకు సమేతం చెప్పరాదు.

౧౦. మహోత్సవము జరుగు దినమున్నూ, స్థలమున్నూ ముందు ముందు తెలుపగలము.

* * *

ఇదీ సంగతి. నేను కలకనడం లేదు. ఇదంతా యదార్థమే. మళ్ళీ కేక వేశాను. "వటీ" అని.

వచ్చిందినా భార్య-వటీ! జపాను స్త్రీలు వేసుకొనే 'కిమానో' అనే చొక్కా తొడుక్కొంది. వళ్ళంతా పట్టుపువ్వులు, పట్టు ఆకులు, పట్టు సీతాకోకచిలకలతో మోసిపోతోంది. చీర కట్టుకోలేదు. చీరకుబదులు టర్కీ స్త్రీలు తొడుక్కొనేలాంటి లాగు తొడుక్కొంది. మొహమల్ స్లిప్పర్లు తొడుక్కొంది. తాంబూలం నములుతూ వచ్చింది. నా భార్యను నేను పోల్చలేనంతమార్పు ఆ అలంకరణ మావిడకు తెచ్చిపెట్టినది. వచ్చి సోఫామీద నాపక్కని కూచుంది. "వెల్, మై డియర్, ఎందుకు పిలిచావు?" అంది.

ఎంతో ఉత్సాహంతో నాకు ఆనందం కూర్చాలని కొత్త కొత్త అలంకారాలు చేసికొనివచ్చి నాపక్కని కూచున్న నా భార్యకు ఉత్సాహభంగం కలగజెయ్యడం క్రూరత్వ మనిపిం

చింది. నగ్న దినం సంగతి తరవాత మాట్లాడుకో కూడదా అను కొన్నాను. లోపలనుంచి పుట్టుకువస్తూన్న కోపాన్ని, జెలసీని దిగమింగదలిచాను. కాగితం మడత నా భార్యకు కనిపించ కుండా సోఫా కవరులోకి తోశాను.

"ఎందుకు పిలిచారో మాట్లాడరేం?"

అంది నా బుజంమీదికి వాలుతూ.

"ఊరికే కేసే, ఆలస్యం చేస్తూ ఎంతకూ రాలేదని" అని అబద్ధ మాడాను.

"మరి ఆ వెర్రి కేక వేశారేమి?" అన్నది నా మీసం వదులుగా పట్టుకొని.

"వెర్రి కేకా; నేను కేక వేస్తే వెర్రి కేకాను, నువ్వు కేక వేస్తే కోకిలపలుకూను—అవునా?"

"మీరు తొందరగా బెంగగా కేక వెయ్యలేదూ? నిజం చెప్పండి."

"నేను చూస్తే వెర్రి చూపూను, నువ్వు చూస్తే తుమ్మెద బారూను—అవునా?"

"కావ్య" ధోరణిలో పడుతున్నారేం? మనుచరిత్రగాని చదువుతున్నారా ఏమిటి?" అంది మీసం నలుముతూ.

"నువ్వు పిలిస్తే ఆజ్ఞాను, నేను పిలిస్తే మాటాను—అవునా?" అన్నాను మీసం వదిలించుకొని.

"నా పీచ్‌కి ధోరణి ఎక్కువౌతోందేం?" అంది నా క్రాఫింగుజుట్టులో వేళ్లుపెట్టి తడుముతూ.

"మై డార్లింగ్" అని నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గిరికి లాక్కొన్నాను. నా భార్యతల షాంపూ వాసన వేస్తోంది. ముఖం పౌడరువాసన. చెక్కిళ్ళు చెర్రీవాసన. కిమోనా మల్లిపువ్వుల వాసన. నా గదిలో అత్తరువుచెట్లు పూసినట్లుంది. నాభార్య వళ్ళో వాలింది.

మళ్ళీ నగ్నదినం సంగతి జ్ఞాపకం వచ్చింది. అడగాలనుకొన్నాను. ఆనందమయమైన నాగదిని శుద్ధ సినిమాసీను చెయ్యడం మంచిదికాదనిపించింది. అయినా—మొత్తంమీద-ఆడవాళ్ల తళుకు బెళుకుల ముందర మగవాళ్ళు వట్టి......

౨

ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకొన్నాను. నాభార్య కాఫీ వగైరాలు బల్లమీద తయారుచేసి ఉంచింది. ఇద్దరమూ కబుర్లు చెప్పుకొంటూ కాఫీ పుచ్చుకొంటున్నాము. నాభార్య ఒక స్వెటరు వేసుకొంది. పల్చని చారలచీర కట్టుకుంది. అది బహుశా ఉదయకాంపు డ్రస్సై ఉండవచ్చు.

"అయితే వటీ—ఈమధ్య నేనోపుస్తకం చదివాను. బహుశా నువ్వూ చదివే ఉండవచ్చు. "న్యూడిస్టుకల్టు" దానిపేరు అన్నాను.

"ఒకపుస్తకమేమి? చాలాపుస్తకాలు చదివాను" అన్నది కాఫీ చప్పరిస్తూ.

"అయితే ఈ నగ్నసిద్ధాంతం నీకు సమ్మతమే నంటావా? ఆడవాళ్ళూ, మగవాళ్లూ దిగంబరులై ఏకదేశంలో సంచరించడం ప్రమాదకరంగాదూ?"

"మీకన్నీ ప్రమాదకరాలే! నాలుగు శతాబ్దుల వెనక ఉండవసినవారు మీరు."

"నువ్వు నాలుగు శతాబ్దాలు ముందుండవలసినదానవు కావూ?"

"మాటలునేర్చిన కుక్కను ఛీ అంటే ఛీ అందిట."

"సరేగాని, మనము ఒక సంఘంలో ఉన్నతరవాత ఆసంఘపు కట్టుబాటుల......"

చాల్లెండి మీరూ మీ పుచ్చుసంఘమూను. వితంతువివాహమంటే, విడాకుల చట్టమంటే, రజస్వలా వివాహమంటే, నగ్నసిద్ధాంతం అంటే అన్నీ ప్రమాదకరములే మీకూ మీ సంఘానికన్నీ."

"అయితే ఒకప్రశ్న అడగనా?"

"అడగండి. అందుకు నా ఆజ్ఞ కావాలా?"

"మరి నీవు వెడతావా నగ్నదిన మహోత్సవానికి?"

నా భార్యముఖం వెల్లబారింది. ఎరగనట్టు నటిస్తూ అంది కదా "నగ్నదిన మహోత్సవమేమిటి?"

'ఏమిటో నీకు తెలియదూ!'

"ఏమిటో అసలు చెపుదురూ?"

"నీకు తెలియదూ?"

"చెప్పరు కాదూ! నా స్వీట్ డియర్ కాదూ! నా సోల్ కాదూ! చెప్పండి మరి!"

"నీకు ఆహ్వానం కూడా వచ్చింది కాదూ?" అన్నాను.

"ఎవరు చెప్పారు మీకు?"

"ఎవరూ చెప్పలేదు. నేనెరుగుదును."

"అలాగా! ఎరిగుంటే దాచుకోండి! నాకు చెప్పనక్కర్లేదు లెండి."

"మీ క్లబ్బు వార్షికోత్సవం జరుపుతారటగా" అన్నాను.

నా భార్య భయంతో అనుమానంతో తాగుతూ తాగుతూ ఉన్న కాఫీ అక్కడ ఉంచి లోపలికి వెళ్ళింది. తన పెట్టె తాళం తీసి కాగితాలన్నీ పరీక్ష చేసింది. నా గదంతా వెదికింది. నా కాగితాలన్నీ కిందామీదా పారేసింది. తన చేతిసంచీ తిరగా బోర్లా వేసి చూచింది. బిక్కమొహంతో వచ్చి మళ్ళీ నా ఎదుట కూర్చుని కత్తులు విసురుతోంది నామీద కళ్ళతో.

"ఇలాంటి పనులు ఎప్పుడు నేర్చుకొన్నా" రంది.

"ఎలాంటి పనులు?"

"దొంగపనులు—నా కాగితం మీరు తియ్యలేదూ!"

"కాగితం పారేసుకున్నావా?"

"మరే."

"మరే అయితే అనుభవించు."

"నాకాగితం తీశారా లేదా!"

"నిజం చెప్పనా?"

"నా కాగితం నాకియ్యండి."

అని ఏడుపుమొఖం పెట్టింది.

"నేను నీకాగితం తియ్యలేదు, కళా! నిన్నరాత్రి సోఫా కిందడుంటే ఏమిటోనని తీసి చూచాను" అన్నాను లేచి నా భార్య వెనక నిలబడి తలరాస్తూ.

"సంచీ లోంచి పడిపోయింది కాబోలు." అన్నది.

"కావచ్చు" అన్నాను.

"నా కాగితం మీరెందుకు చదవాలి?"

"చదవ వద్దన్నావా?"

"నాకేం తెలుసు మీరు తీస్తారనీ?"

'దానిమీద చదవవద్దని లేదే!'

'నాకాగితం నాకివ్వండి.'

'సోఫామడతలో పెట్టాను.'

అనడంతోనే నాభార్య గదిలోకివెళ్ళి ఆహ్వానపత్రిక తెచ్చింది.

'భర్తలకుకూడా చెప్పకూడదని యిందులో లేదూ' అన్నది.

'ఉన్నమాట వాస్తవమే.'

'మరి ఎందుకు చదివారూ?'

'నీకు మతిపోతోంది. చదివాక తెలిసింది ఆవాక్యం అందులో ఉన్నదని. నేను చదివితే నీకువచ్చే ఉపద్రవం ఏమీలేదులే.'

'నేనొకటి చెపితే చేస్తారా?'

'ఒకటిగాదు, పది చేస్తాను.'

'ఇందులో విషయాలు ఎవరితోనూ చెప్పనని ఒట్టు వేసుకోండి.'

'ఏమని ఒట్టు?'

'నామీద ఒట్టు వేసుకోండి.'

'అమ్మో! నీమీదా? నేను వేసుకోను. నీవు నా ప్రాణమున కును ప్రాణమూ ప్రాణకాంతవు కాదూ?'

'అయితే యితరులతో చెప్పుతారన్నమాట' అంది.

'ఎన్నటికీ చెప్పను' అన్నాను.

'అయితే ఒట్టేసుకోండి' అని చేతులెత్తి నాచెవులు గట్టిగా పట్టుకొని, 'వేసుకుంటారా? వేసుకుంటారా? ఏం?' అంది.

'వదులు, వదులు, అమ్మో, అమ్మొయ్యో, వదులు, వేసుకుంటా' అన్నాను ఆమె తలమీదకు వంగి.

'వేసుకోండి మరి'

'వదులు, వేసుకుంటా! ఎవ్వరితోనూ నగ్నదిన మహోత్స వాహ్వాన పత్రికను గురించి చెప్పను- నీతోడే; నీమీద ఒట్టు. ఈమాటు వదులు.'

నా భార్య చెవులు వదిలింది. నిలబడి కొండు చేష్టలూ ఎన్ని మార్లో ముద్దెట్టుకొంది.

'వట్టి మోటమనిషి వైపోతున్నావు సుమా! అబ్బ' అన్నాను చెవులు తడుముకొంటూ.

'మరే! నా కాగితం చదవొచ్చు గాని' అంది.

'నీవే యింత పెంకిమనిషివి గాని మిగిలిన స్త్రీ పెండ్లాలందరూ తమ భర్తలతో చెప్పకుండా ఉండగలరనుకున్నావా ఏమిటి?'

'ఎప్పుడూ చెప్పరు.'

'చెప్పరూ? అందరూ నీలాగే అనుకొన్నావు కాబోలు!'

"మగవాళ్లనుకొన్నారా ఏమిటి చెప్పడానికి' అని నాకేసి తిరిగి పెంకె నవ్వు నవ్వింది.

'అవును, అందుకనే ఆడవాళ్ళనోట్లో నువ్వుగింజ నానద న్నారు' అన్నాను.

'మానోట్లో నువ్వుగింజ నానక్కర్లేదులెండి. అన్ని నువ్వు గింజలూ మీ నోళ్ళల్లోనే నాన వేసుకోండి' అని విసురుకుంటూ

తివ్వుకుంటూ స్లిప్పర్లు తొడుక్కొని కాఫీ ముగించి నాభార్య యింట్లోకి వెళ్ళిపోయింది. డ్రెస్సు మార్చుకోవడానికి.

నేనన్నో ప్రశ్నలు వేయదలచుకొన్నాను ఆవిణ్ణి. వీలై వదికాదు. పోనీ యింకోమాటు.

## ౩

పిల్లాళ్ళక్రితం ఒక ఇంగ్లీషు దొరసాని లేడీస్ కల్చరుక్లబ్బులో 'దిగంబరత్వము: ఆరోగ్యము' అనే విషయముమీద ఉపన్యాసము యిచ్చినదట. దిగంబరత్వ మనగానే భయపడనక్కరలేదనీ, దానివల్ల ఎటువంటి ముప్పూగూ సంభవించదనీ, వస్త్రధారణము మనము తెచ్చిపెట్టుకొన్నది గాని మనకు సహజము కాదనీ, దిగంబరత్వమే మనకు సహజమైనదనీ, మృగముల నుండి మనము నేర్చుకొనవలసిన విషయములలో యిది వకటనీ ఉపన్యసించింది. ఈ వస్త్రధారణము వల్ల మనకు అనేక కీడులు తటస్థిస్తున్నవనీ, అనేక చెడుగుణములు కలుగుతున్నవనీ నొక్కి చెప్పింది.

సిగ్గు బిడియములు జంతుకోటిలో ఎక్కడా లేవనీ వస్త్రధారణము వల్లనే మనుష్యులకవి సంక్రమించినవనీ తెలియజేసింది. సూర్యరశ్మి తగలకుండా, గాలి ప్రవేశించకుండా దేహభాగములు నిరంతరమూ కప్పుకోవడంవల్ల స్త్రీ పురుషుల కనేక

విధముల రోగములు కల్గుతున్నవని నిదర్శన పూర్వకముగా నిరూపించింది. ప్రపంచములో కామవికారము జంతువులం దుద్భవించడము సంతానాభివృద్ధికోసమే ననిన్నీ, అది ఒక ఋతువులోనే తటస్థిస్తున్న దనిన్నీ, మానవులలో యీ కామము, వస్త్రధారణము వల్లనే అసహజమై, రోగప్రాయమై, నిరంతరమై బాధించుచున్న దనిన్నీ, దిగంబరత్వమే అవలంబించినట్లయితే నీతి దుష్కృతులకు సంఘములో స్థానమే ఉండ దనిన్నీ తెల్పింది. స్త్రీ పురుష భేదము మానవ హృదయాలలో అంకురించడానికి యీ వస్త్రధారణమే మూలమన్నది. దిగంబరత్వమువల్ల అట్టిభేదము అంతరించుననీ మానవులలో ఏకత్వం సంభవించుననీ చెప్పింది. ఆవులూ, కుక్కలూ, పిల్లులూ మున్నగు జంతువులు నగ్నంగా లేవా? అందువల్ల వాటి కేమి ముప్పువచ్చింది? వాటిని మనము నగ్నముగా చూడ్డం లేదా? మనకు వింతగా ఉన్నదాని కారణము అలవాటు. కాబట్టి అలవాటు చేసుకొన్నట్లయితే దిగంబరత్వమువల్ల మనకు అనేకలాభములు కలుగునని చెప్పింది. దిగంబరత్వము మన సిగ్గును పారద్రోలుతుంది. మనసీతిని తలయెత్తనియ్యదు. మన నిరంతర కామ వికారమున కది మందు. మనరోగము లంతరించుటకు దిగంబరత్వ మమృతప్రాయమైనది. దిగంబరత్వము మన జన్మహక్కు అని ఆ దొరసాని తన ఉపన్యాసము ముగించింది.

ఈ ఉపన్యాసము విన్న లేడీస్ కల్చరుక్లబ్బు మెంబర్లందరూ ఎంతో సంతోషించారు. నాగరికమున కాటపట్టులైన పాశ్చాత్యదేశాల్లో నగ్నశ్రేణులు బయలుదేరుతున్నవన్న కారణముచేత తామన్నా అట్టి ప్రయత్నములు సల్పడము ఉచితమని తీర్మానించుకొన్నారు. దేశకాలముల ననుసరించి ప్రస్తుతము స్త్రీలు మాత్రమే నగ్నత్వం అవలంబించవలెననిన్నీ, అవసరమని తోస్తే ముందుముందు పురుషులను కూడా చేర్చుకోవచ్చుననిన్నీ అనుకొన్నారు. దీని పర్యవసానమే నగ్నదిన దిన మహోత్స వాహ్వాన పత్రిక.

* * *

'సిగ్గూ బిడియం లేకపోతేసరి- ఎందుకొచ్చిన బతుకంట.. మనిషిజన్మ ఎత్తితేసరా...' అనబోతూంటే నాభార్య నా నోటి కడ్డంగా చెయ్యిపెట్టి అన్నదికదా, 'మైడియర్ స్వీట్ హబ్బీ, మీకేమైనా ఇమేజినేషన్ ఉందా? ఊహాపోహాలున్నవా? స్వాతంత్ర్యాలోచన ఉందా? దిగంబరత్వాన్ని గురించి యింతా చెప్పితే శ్రీరంగనీతులు చెబుతున్నారా? మీరు నాకు భర్త అని చెప్పుకోడానికి నాకు సిగ్గుగా ఉంది.'

'అయితే వదిలిపెట్టరాదూ.'

'మిమ్మల్నా వదిలిపెట్టడం? వటీరావు అంటే ఏమనుకొన్నారో॥'

'అయితే నిజంచెప్పు; బట్టలు లేకుండా తిరిగితే సిగ్గుండదూ?'

'ఎందుకు సిగ్గు; మీరు నాముక్కు చూడ్డంలేదూ, నోరు చూడ్డంలేదూ, చెవులు చూడ్డంలేదూ? సిగ్గుపడుతున్నారా? దేహమంతా చూపితే ఏమితప్పు? ఎందుకంత సిగ్గు?'

'అను, అనేదేమిటో పూర్తిగా అను.'

'అంటాను నాకేం భయంలేదు. ఈ దొంగబిడియాలు నా చేతగావు. బ్రాహ్మలనీ బ్రాహ్మణేతరులనీ, స్త్రీలనీ పురుషులనీ, భేదాలు పెట్టి అన్యాయం చేసేరోజులు వెళ్ళాయిలెండి.'

'అయితే యీ స్త్రీ పురుష భేదానికికూడా బ్రాహ్మలే కారణమంటావా ఏమిటి?'

'ఏమో! ఎవరు కారణమైతే నేమి? అన్యాయం అన్యాయమే.'

'శాంతించు, వటీ, శాంతించు--ఆవేళ నేను చెప్పినమాట నిజమైందా?'

'ఏమిటా మాట?'

'మెంబర్లు భర్తలతో యీ విషయం చెబుతారన్నాను జ్ఞాపకం లేదూ.'

'నే నెవ్వరినీ అడగలేదులెండి.'

'నేను అడక్కుండానే మెంబర్లభర్తలు నాదగ్గిరికి వచ్చి ముక్కుమీద వేలు వేసికొని చెప్పారు' అన్నాను.

‘చెప్పి!’

‘ఇది తప్పించే మార్గం లేదా’ అన్నారు.

‘అంటే మీరేం చెప్పారు?’

‘ఏమీలేదు. చూస్తూ ఊరుకొని ఉండడమే మంచిది అని చెప్పాను.’

‘ఇన్నాళ్ళకు మీరు తెలివిగా ప్రవర్తించారని సంతోషిస్తున్నాను.’

‘అయితే, కళా, మొగాళ్ళులేని ఆడవాళ్ళ నగ్నత్వంవల్ల ప్రయోజన మేమి’ అన్నాను.

‘అయితే మీకుకూడా వస్తారా?’

‘నన్ను రానిస్తారా!’

‘మీా కొక్కరికీ నేను అనుమతి తెస్తానన్కోండి.’

‘నేను రానుసుమా, నాకు సిగ్గు.’

‘అయితే ఎందుకా పెంకెప్రశ్న వేశారు?’

‘నీ చిత్తవృత్తి తెలియడానికి.’

‘అయితే మీరొచ్చితీరాలి. తప్పదు.’

‘బలవంతమా ఏమిటి.’

‘ఆ, బలవంతమే. రహస్యం సుమండీ, ఎవరితోనూ చెప్పకూడదు సుమండీ.’

‘మళ్ళీ నామీద ఒట్టేసుకొమ్మంటావా?’

'నా మీద ఒట్టేసుకొమ్మనను లెండి—వినండి. ఆదివారం రాత్రి పదిగంటల మూడుగంటల మధ్య దీపస్తంభాని కెదురుగా ఉన్న బీచిలో నగ్నదిన మహోత్సవం జరుగుతుంది.'

'రాత్రి చీకటికాదూ.'

'వెన్నెల రాత్రుళ్ళు కాదండీ.'

'అవును అన్నట్టు; రాత్రి బీచి ఒడ్డున చలివెయ్యదూ?'

'ఓర్చుకోవడానికి సిద్ధపడ్డాము లెండి. ఎవరితోనూ చెప్పకండిసుమా. మీరొక్కరే రండి.'

'చూస్తాను.'

'చూడ్డంకాదు. తప్పక రావాలి!'

* * *

క్లబ్బు మెంబర్లందరూ మహోత్సవం జరపడానికి మార్గాలాలోచించుకుంటూంటే మెంబర్ల భర్తలము మేమందరమూ దానిని చెడగొట్టే ఉపాయాలు వెదుకుతున్నాము.

ఒకరోజు ముందునుంచీ క్లబ్బు మెంబర్లందరూ క్లబ్బులోనే ఉండిపోవడం మొదలుపెట్టారు. అక్కడే భోజనాలేర్పాటు చేసుకొన్నారు. అక్కడే పడకలు ఏర్పాటు చేసుకొన్నారు. ఆ కారణంవల్ల భర్తలందరికీ కొంత తీరుబడి చిక్కింది. మేమంతా మాయింట్లో సమావేశమయ్యాము మన హిందూదేశంలో మన స్త్రీలు యిటువంటి పనులు చేస్తున్నారంటే లోక

ములో హిందూ స్త్రీజాతి కంతకీ అవమానకరంగా ఉంటుందనిన్నీ, హిందూ స్త్రీల మాన మర్యాదలు కాపాడే బాధ్యత పురుషులమీద ఉన్నదనిన్నీ, తత్కారణమున ఈ నగ్నదిన మహోత్సవం జరగకుండా చెయ్యడం ధర్మమనిన్నీ తీర్మానించుకొన్నాము. ఈ ఉత్సవము జరిగే స్థలము కాలము తెలుసుకోవలసిన అవసరం ఉన్నదనుకొన్నాము. స్థలమూ కాలమూ నాకు తెలుసునన్నాను. నాతో పాటు అక్కడి పురుషులందరూ మాకు తెలుసునంటే మాకు తెలుసునన్నారు. అందరికీ తెలిసిన స్థలము—దీపస్తంభాని కెదురుగా బీచివద్ద. అందరికీ తెలిసిన కాలము—ఆదివారం రాత్రి పదిగంటలకీ మూడుగంటలకీ మధ్య కాలం. ఇక దీనికి ఆటంకములు కలుగజెయ్యడము ఎలాగా అనుకొన్నాము. 'ఆడవాళ్ళను ఆరోజున యింట్లో బంధించకూడదా?' అన్నాడు ఒక పెద్దమనిషి—స్త్రీ స్వభావం తెలియనివాడు, ప్రాణాలకు తెగించీ!

'ఆడవాళ్ళకు నగల బట్టల ఆశచూపి మానిపించ వచ్చునేమో!' అన్నాడు ఇంకోడు ధనికుడు.

'వాళ్ళతో పాటు మనమున్నూ అక్కడ అప్పుడు తయారవుతేనో?' అన్నాడు యింకో బుద్ధిమంతుడు. ఈ ఉపాయం బాగుందంటే బాగుందని అందరమూ వప్పుకొన్నాము. అందరమూ, ఆరోజున, గూఢమార్గాన్ని బట్టి ఎవరికీ తెలియకుండా బీచికి చేరుకోడానికి నిశ్చయించుకొన్నాము.

అయితే ఒక సందేహం కలిగింది. ఒకవేళ స్థలమూ కాలమూ విషయమై ఏమైనా మోసం జరిగిందేమో? ప్రతీభర్తా ఈ విషయం తనభార్య చెప్పగా తెలుసుకొన్నట్టే చెప్పాడు. భార్యలందరూ భర్తల్ని ఒకమోస్తరుగానే మోసంచేసి ఉండరనిపించింది. ఏమైనా స్థలమూ కాలమూ అవే అని నిశ్చయము చేసుకొన్నాము.

౪

ఆదివారం తొమ్మిదిగంటలకి భర్తలందరమూ మా యింట సమావేశమయ్యాము. మోసముండదని నిశ్చయించడము కోసము క్లబ్బువ్యవహారాలు తెలుసుకొంటున్నాము.

క్లబ్బుకు ఉండుండీ ఒక్కొక్క కారు వస్తోందిట. రావడంతోనే ముసుగేసుకొన్న ఒకస్త్రీ కారులో ఎక్కుతోందిట. తెరలు దింపుకొని కారు బీచికి వెళ్ళుతోందట. ఇది తెలుసుకొన్న పిమ్మట మాకు ధైర్యం కలిగి ఒకింతరువాత ఒకరము వేరు వేరు మార్గాల్ని బట్టి బీచికి బయలుదేరాము.

పది దాటింది. మేమందరమూ అనుకొన్న ప్రకారము దీపస్తంభము వెనక చేరకొన్నాము. కార్లు వస్తున్నాయి. స్త్రీలు దిగుతున్నారు. స్త్రీలు ముసుగులతోనే బీచివడ్డున తిరుగుతున్నారు. రావలసిన కార్లన్నీ వచ్చినట్టే తోచింది. అందరు స్త్రీలూ దిగినట్టే తోచింది. గుంపులు గుంపులుగా స్త్రీలందరూ చేరుకొని ఏవేవో కబుర్లు చెప్పుకొంటున్నారు.

స్త్రీలు తనుబట్టలు విసర్జించుకోవడం మొదలు పెట్టడం తోనే మేము మరుగునుంచి వెల్లడిస్థలమునకు, వారికి బాగా కనిపించే స్థలమునకు వెళ్ళవలెనని నిర్ధారణ చేసుకొన్నాము. పదకొండు గంటలైంది. స్త్రీలు యథాప్రకారం తిరుగుతు న్నారు. నగ్నలు కాలేదు. పన్నెండు గంటలైనది. ఏమీ మార్పులేదు.

మాకు కారణం తెలిసిందికాదు. మమ్మల్ని కనిపెట్టి ఉం టారా వాళ్ళు అనుకొన్నాము. మేము కోరినదీ అదేగదా! వాళ్ళ నగ్నదినమును భగ్నముచెయ్యడమే మా ఆశయము గదా! అది ఈడేరుతూన్నందుకు మాకు సంతోషముగానే ఉన్నది కాని—నిజం చెప్పవలసి వస్తే—మా కందరికీ ఒక విధంగా ఆశాభంగం కలిగింది. ఎంత నగ్నదినాన్ని భగ్నం చెయ్యదలచుకొన్నా మా మనస్సులు నగ్నలను చూడ్డానికి తహతహ పడుతూనే ఉన్నవి.

ఒంటిగంట అయింది ఏమీ మార్పుకానరాలేదు. మాకు విసుగెత్తింది. చలి వేస్తోంది. నిద్రకు కళ్లు బరువెక్కుతున్నాయి. చంద్రుడు పశ్చిమదిక్కు చేరబోతున్నాడు. చంద్రకాంతిని తరంగశిఖరాలమీద లాలిస్తున్నాడు సముద్రుడు. సముద్ర ఘోష దిక్కులను కప్పింది.

మేము ఒకరొకరము బీచికి చేరుకొంటున్నాము. నీరుపారి తడిసి గట్టిపడిన యిసుకమీద నడిచి వెళ్ళాము. స్త్రీల గుంపు

ళను సమీపించాము. నా భార్యకోసం నేను వెదికినట్లే యితరులున్నా తమ భార్యలకోసం వెదుకుకొన్నారు. నా భార్య నాకు కనిపించలేదు. వాళ్ళభార్యలు వాళ్ళకు కనిపించలేదు.

రెండుగంటలయింది. అందరమూ మళ్ళీ దీపస్తంభందగ్గిర చేరుకొన్నాము. ఏమిటిది అంటే ఏమిటిది అనుకొన్నాము.

మనలను మోసంచేసి వాళ్లెక్కడికో పోయారు అని సిద్ధాంతం చేసుకొన్నాము.

మరి యీబీచిని యీ స్త్రీరత్నము లెవరు?

పరిశీలనగా చూచిన ఇద్దరుముగ్గురు పెద్దమనుష్యులు—

"వాళ్ళు దాసీవాళ్ళు చూడలేదా!" అన్నారు.

మూడుగంటలైంది. బీచిలో స్త్రీగుంపులు తరిగిపోతున్నాయి. చంద్రుడు అస్తమించాడు.

మేము ఇంటిమొహం పట్టాము తలలమీద గుడ్డలు బిగించుకొని! కారులు మమ్మల్ని హూటుచేస్తూ పారిపోతున్నాయి దాసీవాళ్ళతో కూడా.

సముద్రుడుకూడా తన ఘోషతో మమ్ము గేలిచేస్తున్నాడు.

X

సోమవారం ఉదయం యింటికి చేరుకున్నాను. భర్తలందరమూ కాలవ ఒడ్డున మొహాలు కడుక్కొని ఏవిధంగా అలవిగాని ఈ భార్యలను వశము చేసుకోవడమా అని ఆలోచిస్తూ యిళ్ళకు చేరుకొన్నాము.

—

నా భార్య కాఫీ, టిఫిన్ సిద్ధంచేసి ముసిముసి నవ్వులతో నేను గుమ్మం దాటడంతోనే "గుడ్ మార్నింగ్, డియర్" అన్నది. నాకాశ్చర్యం వేసింది. నా భార్య యింట్లోనేడున్నదే. నగ్నదిన మహోత్సవం జరగలేదు కాబోలు అనుకున్నాను. "గుడ్ మార్నింగ్, డార్లింగ్" అని ముభావంగా చెప్పి లోపలికి వెళ్ళిపోయాను.

"అవశిష్టాలు తీర్చుకొని చప్పునరండి కాఫీకి" అంది.

"ఊఁ" అన్నాను.

* * *

కాఫీ తాగుతున్నాము. నా భార్య నాకేసి తిరిగి, 'పాపం, ఆశాభంగం కలిగింది కాబోలు, సారీ!' అన్నది.

"ఎందుకు మమ్మల్ని మోసంచేశారు?"

"మిమ్మల్ని ఒకరినే రమ్మంటే అందరినీ ఎందుకు తీసుకు వెళ్ళారు?"

"నేను తీసుకు వెళ్ళలేదు. వాళ్ళంతట వాళ్ళే వచ్చారు."

"ఈ మొగాళ్ళతో చెప్పితే కార్యాలు యిలాగే జరుగుతాయని మాయచేశాము."

"ఎందుకంట యీ మాయ. మమ్మల్ని రావద్దంటే మానమా?"

"మానరూ, పాపం? రాత్రల్లా దీపస్తంభాన్ని ఆశ్రయించారూ? బీచికి వచ్చిన దాసివాళ్ళ మొహాలు పరికాయించి చూశారూ? ఆశాభంగం కలిగించేం, పాపం?"

"అప్పుడే ఎలాగ తెలిసింది నీకూ?"

"కార్డు వచ్చాయి కావ్యా."

"ఈ మోసం చాలా మీణగా ఉంది."

"ఇందుకు మీరే కారణం."

"నేనా?"

"ఈ ఆహ్వానపత్రిక మీ చేతులో పడకపోతే ఏమీ ఉండక పోను."

"ఎందువల్ల?"

"నేను వెళ్లి చెప్పాను—యిటువంటి ప్రమాదం కలిగిందని ఎలాగో భర్తలు-భార్యలవద్దనుంచి యీవిషయం గ్రహిస్తా రని ఊహించి మిమ్మల్ని మాయచేసి వేరే యింకోచోట ఉత్సవం జరుపుకోడానికి నిశ్చయించుకొన్నాము. జరుపుకొన్నాము."

"జరుపుకొన్నారా?"

"ఆఁ."

"ఎప్పుడు?"

"ఆదివారం ఉదయం మొదలు సాయంత్రందాకా."

"ఎక్కడ?"

"పేరాపురం పాడుకోటలో. ఊరికి దూరంగా ఉంది. చుట్టూ గోడలున్నాయి. లోపల అన్నీ చెట్లు. ఎంతో రహస్యంగా వైభవంగా జరిగింది."

"ఎంతమోసం. మగాళ్ళు ఎవళ్ళయినా వచ్చారా?"

"వస్తే పిస్తోలుతో కాల్చిఉందుము!"

"పిస్తోలుతో కాల్చడానికేనా నన్ను రమ్మంట."

"మిమ్మల్ని వెళ్ళమంట బీచికి- పేరాపురం కోటకుకాదు."

"అయిందేమిటో అయింది- ఏమిటి విశేషాలు?"

"వైభవంగా జరిగిందన్నాను కాదూ."

"మెంబర్లేనా, యింకా యెవరైనా వచ్చేరా?"

"నేను నా స్నేహితురాలిని ఒకతెను తీసుకు వెళ్ళాను."

"ఎవరూ?"

"ఎవరైతేనేమి? నేను వాళ్ళింటికి వెళ్ళి, రహస్యంగా అంతా చెప్పి, వస్తావుటమ్మా అన్నాను. అంతే ఆపిడ బుగ్గలమీద వేళ్లు వేసుకొని- ఇదేమిటమ్మా? వీళ్ళకేమిచేటుకాలం వచ్చిందమ్మా? వీళ్లమొహం ఈడ్చ! యిలాంటిబుద్ధులు పుట్టుకొస్తున్నాయేమమ్మా యీకాలపు ఆడవాళ్ళకు? సిగ్గు బిడియాలు ఉండనక్కర్లేదుటమ్మా?—అంటూ అడ్డమైనతిట్లూ తిట్టి చివరికి తయారైంది."

"తిట్టికూడా ఎందుకు వచ్చింది?" అన్నాను.

"తానూ వచ్చి వాళ్ళ మొహాలు అక్కడే తగలేస్తానంది."

"చివరికి ఏంచేసింది?"

„మా అందరికన్న ఎక్కువగా ఆవిడే తిరిగింది. ఆరోజు వంటచేసిపెడతా. ఆవిడే—ఇదటర్రా నగ్నదినం అంటే, ఏమిటో అనుకున్నాను. ఇందులో కొత్తేముందర్రా. రోజూ తలుపు వేసుకొని చిన్నబట్ట కట్టుకొనో కట్టుకోకుండానో పనులు చేసుకోవడం లేదటర్రా. దీనికింత గొడవ చేశారెందుకర్రా - అంది."

„నువ్వేం చేశావు?"

„బాడ్ మింటన్ వాలీబాల్, పరుగులపందెం—వగైరా ఆటలు ఆడుకొన్నాం కొంతమంది."

„మిగిలినవాళ్ళు?"

„పొట్టలు పెంచుకొన్నవాళ్ళూ, దొడ్డికాళ్ళవాళ్ళూ, శుష్కవక్షులూ—తమ నగ్నత్వాన్ని బహిరంగ పరుచుకొని సిగ్గుపడుతూ వన్యమృగాల్లాగ ఆచెట్టుకిందా ఆచెట్టుకిందా నక్కి కూర్చుండిపోయారు- తమ కురూపానికి తామే వగస్తూన్నట్టు."

„నీవు సిగ్గుపడలేదు కాబోలు—వన్యమృగంలా నక్కలేదు కాబోలు—ఏం?"

„నాకు ఏమిలోటుందని సిగ్గుపడడానికి—మీరు తప్ప."

„మై డియర్ నాటీ ఓల్డుగరల్!"

„మీరు ఎప్పుడైనా నగ్నదిన మహోత్సవానికి వస్తే—నక్కుతా రనుకుంటా."

"ఒకే—అయితే దీనికేమైనా ప్రైజుందా?" అన్నాను.

"ఆ, ఉంది, బహుమానం. నేను మీకిచ్చేది" అంది.

"ఏమిటది?" అన్నాను.

"ఇది" అని నా మీసాలు లాగి చెంపలు వాయించి ముద్దెట్టుకొంది.

"మిస్ చివస్ దిగంబరీ!"

---

# ఫాన్సీ డ్రెస్ పారేడ్

౧

ఆదివారం సెలవుదినం కాబట్టి సావకాశంగా వటీరావుకు అలంకరణం చేస్తున్నాను:—ఇదివరలో వ్రాతమూలకంగా ఒప్పన్నమైన షరతులనుబట్టి:

వటీరావుతో "ప్రణయ రాజీ" చేసుకొని జోళ్ళు తుడవడం, వాటికి రంగుపూయడం మాత్రం నౌకరీ కుర్రవాడికి అప్పజెప్పాను.

వటీరావు శరీర సౌందర్యపోషణ క్రియలు మాత్రము నేను చేస్తున్నాను—సంవాహన మునసబో.